క్లుప్తంగా

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న హెచ్‌ఎం రవీంద్రబాబు

బుచ్చెయ్యపేట:నులిపురుగుల నివారణకు మండలంలోని తురకలపూడి జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఆల్బెండ్‌జోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోతురకలపూడి ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

160 మందికి వైద్య సేవలు



కేజే పురంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురంలో బుధవారం ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె. లీలాప్రసాద్ 160 మందికి వైద్య సేవలందించారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు పి.శంకర్, ఎంఎల్‌హెచ్‌పీ లలిత తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ పాత్‌లపై ఆక్రమణల తొలగింపు



దుకాణాలను తొలగించాలని వ్యాపారులకు సూచిస్తున్న సీఐ రేవతమ్మ

నర్సీపట్నం:మున్సిపల్, పోలీసు అధికారులు సమన్వయంతో మున్సిపాలిటీలోని శారదానగర్ మెయిన్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, సీఐ రేవతమ్మ, ఎస్‌ఐ రమేష్ పర్యవేక్షణలో శ్రీకన్య కూడలి నుంచి మంగీలాలు స్వీట్‌స్టాల్ వరకు మున్సిపల్, పోలీసు సిబ్బంది ఆక్రమణలు తొలగించి, మెయిన్ రోడ్డుకు మధ్యలో గుంతలను గ్రావెల్‌తో పూడ్చారు. ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దని సీఐ రేవతమ్మ వ్యాపారులకు సూచించారు.

దేవరాపల్లి ఎంపీడీవోగా సువర్ణరాజు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సువర్ణరాజు

దేవరాపల్లి: దేవరాపల్లి ఎంపీడీవోగా ఎం.వి. సువర్ణరాజు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చెయ్యపేట మండల నుంచి బదిలీపై వచ్చిన సువర్ణరాజును పంచాయతీ కార్యదర్శులతో పాటు పలువురు అధికార్లు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎంపీడీవో సువర్ణరాజు మాట్లాడుతూ మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు సహాయ సహకారాలతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

దేవరాపల్లి: గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. ఎం. అలమండ, కాశీపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. ఎం. అలమండ, కాశీపురం గ్రామాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను, వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయ స్టాళ్లను సందర్శించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారులతో మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారి వి.రవీంద్రనాథ్, ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు, ఏవో కాంతమ్మ, పశువైద్యాధికారి మంజుష, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

గొలుగొండ: మండలంలోని జమ్మేదేవిపేట సమీపంలో సారా విక్రయిస్తున్న గెమ్మల రామన్నదొర, వల్లపు రాజుబాబులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు. నిందితుల నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు.

వంతెన నిర్మాణం పూర్తి..

తీరిన కష్టాలు

- 2012లో నీలం తుపాను సమయంలో కుంగిన వంతెన
- గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు
- రూ.2.40 కోట్లతో నిర్మాణం పూర్తి



నీలం తుపాను సమయంలో కుంగిన పాత వంతెన (ఫైల్)



కుంగిన వంతెనను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ సుబ్బారెడ్డి (ఫైల్)



చిట్టిగెడ్డపై నూతనంగా నిర్మించిన వంతెన

కె.కోటపాడు : మల్లంపాలెం–చౌడువాడ గ్రామాల మధ్య చిట్టిగెడ్డపై వంతెన నిర్మాణం పూర్తి కావడంతో ప్రయాణికుల కష్టాలు తీరాయి. 2012లో నీలం తుపాను సమయంలో వంతెన బలహీనపడి, కుంగిపోయింది. దీంతో దాని మీద నుంచి రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయాందోళనలకు గురయ్యేవారు. వంతెన పరిస్థితిని అప్పటి ప్రజాప్రతినిధులకు రెండు గ్రామాల ప్రజలు ఎన్నిమార్లు విన్నవించినా సమస్యకు పరిష్కారం లభించలేదు.

నెరవేరిన బూడి హామీ

మల్లంపాలెం–చౌడువాడ గ్రామాల మధ్య చిట్టిగెడ్డపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని 2019 ఎన్నికల సమయంలో బూడి ముత్యాలనాయుడు ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో 2022లో మంత్రి పదవిని చేపట్టిన తరువాత చిట్టిగెడ్డపై వంతెన నిర్మాణానికి అంచనాలను తయారు చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. వంతెన పరిస్థితిని పరిశీలించాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ చీఫ్ సుబ్బారెడ్డికి 2022 ఏప్రిల్ 23న సూచించారు. ముత్యాలనాయుడు చొరవతో రూ.2.40 కోట్లు మంజూరయ్యాయి. నిర్మాణం ప్రారంభించే సమయంలో వర్షాలు పడడంతో పనులకు ఆటంకం కలిగింది.అనంతరం నిర్మాణం పూర్తి చేశారు. దీంతో ఇటీవల రాకపోకలు ప్రారంభించారు. రెండు గ్రామాలకు చెందిన ప్రజలు వర్షాకాలంలో నిశ్చింతగా వంతెన పై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. పంటల ఉత్పత్తులను, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చెరకును ఈ వంతెనపై నుంచి తరలించేందుకు అవకాశం ఏర్పడింది.

12 ఏళ్ల తరువాత నిర్మాణం



సుమారు 12 ఏళ్ల తరువాత చిట్టిగెడ్డపై వంతెన నిర్మాణం జరిగింది. మల్లంపాలెం–చౌడువాడ ప్రజల కష్టాలను తీర్చేందు కు చిట్టిగెడ్డపై వంతెన నిర్మించాలని ప్రజాప్రతి నిధులను, అధికారులను కోరాం. ఎవరూ పట్టించుకోలేదు. బూడి ముత్యాలనాయుడు గ్రామానికి వచ్చిన సమయంలో వంతెనను పరిశీలించారు. ప్రజలకు ఇచ్చిన హామీమేరకు నిధులు మంజూరు చేశారు. పనులు పూర్తయ్యాయి. ప్రజల కష్టాలు తీరాయి. ప్రజల తరఫునమాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు.

–రొంగలి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ

పెట్టుబడి సాయం కోసం రైతుల ఆందోళన



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం సభ్యులు

కె. కోటపాడు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయంగా రైతులకు రూ.20వేలు అందజేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. గత ఏడాది ఖరీఫ్ పంట భీమా పరిహారం అందించాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్టుమీటర్లు బిగించే జీవో నంబరు 22ను రద్దు చేయాలని, భూ యజమానుల సంతకం లేకుండా కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతులకు బకాయిలు చెల్లించాలని, భూముల రీసర్వేలో జరిగిన లోపాలను సరిదిద్దాలన్న డిమాండ్లతో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమములో ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, జిల్లా నాయకులు రొంగలి ముత్యాలునాయడు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఏరియా కార్యదర్శి వనం సూర్యనారాయణ, రైతు నాయకులు బొడ్డేడ సన్యాసినాయుడు తదితర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులకు అభినందన



క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జయప్రకాష్

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో ఇటీవల జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటిన తెనుగుపూడి డాక్టర బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థులను స్థానిక ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్ అభినందించారు. స్థానిక గురుకుల విద్యాలయంలో బుధవారం క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. అండర్–14, అండర్–17 బాలుర విభాగంలో ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. కబడ్డీలో ద్వితీయ స్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యా ర్థులు జి.జగదీష్ విజేత, ఆర్. తరుణ్, డి.ప్రశాంత్, ఎస్.జశ్వంత్, ఎస్.రాజకుమార్, ఎస్.గౌరీ మణిశంకర్,పి.సాయికుమార్,ఎన్.సాయి,కె.శ్రీను,ఎం.హరికుమార్‌లతో పాటు పీఈటీ జి.తరుణేశ్వరరావును ప్రిన్సిపాల్ డి.జయ ప్రకాష్ అభినందించారు.

సమయ పాలన, మెనూ అమలులో నిర్లక్ష్యం వద్దు



ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈవో -2 వరహాలబాబు

నాతవరం: ఉపాధ్యాయులు సమయ పాలనతో పాటు మధ్యాహ్న భోజనం మెనూ అమలులో ఎటువంటి నిర్లక్ష్యం చేయవద్దని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాల బాబు సూచించారు. మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలతో బుధవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఈవో ఆకస్మికంగా పాఠశాలలను తనిఖీ చేస్తున్నారని, అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే విషయంలో కూడా కొత్తగా వచ్చిన నిబంధనలు విధిగా పాటించాలన్నారు. మరుగుదొడ్ల శుభ్రత, తాగునీరు, పారిశుద్యం తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, పాఠశాలల యాజమాన్య కమిటీల సమావేశాలు విధిగా నిర్వహించాలని తెలిపారు.

నేడు సహకార సంఘం సర్వ సభ్య సమావేశం

కశింకోట : కశింకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వ సభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు సంఘం ఆవరణలో జరుగుతుందని సీఈవో ద్వారపురెడ్డి నూకేశ్వరరావు తెలిపారు.

వెంకటరావుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, బూడి రమణమ్మ

దేవరాపల్లి: మామిడిపల్లికి చెందిన కర్రి వెంకటరావు సంతాప సభ బుధవారం స్వగ్రామంలో జరిగింది. వైఎస్సార్‌సీపీ దేవరాపల్లి మండల యువజన అధ్యక్షుడు, మామిడిపల్లి సర్పంచ్ కర్రి సూరినాయుడు తండ్రి, స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం సోదరుడు వెంకటరావు ఈ నెల 4న గుండెపోటుతో మృతి చెందిన సంగతి విధితమే. ఈ మేరకు మామిడిపల్లిలో బుధవారం జరిగిన సంతాప సభలో వెంకటరావు చిత్రపటం వద్ద ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సతీమణి బూడి రమణమ్మ, ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీ పార్టీ నాయుకులు, కార్యకర్తలు తదితర్లు శ్రద్దాంజలి ఘటించారు.

డీఎస్పీ మోహన్ బదిలీ



నర్సీపట్నం: నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్ బదిలీ అయ్యారు. ఆయనను ఇంటిలిజెన్స్ డీఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ముందు మోహన్ డీఎస్పీగా నియమితులయ్యారు. డివిజన్‌లో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఆయన పటిష్టమైన చర్యలు తీసుకున్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నక్కపల్లి: పెదబోదుగల్లం హైస్కూల్‌లో 1997లో చదువుకున్న పూర్వ విద్యార్థులు కమిడి రమణ, ఖాశీషా, ఈశ్వరరావు తదితరులు పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చారు. ఓ తరగతి గది మరమత్మలకయ్యే ఖర్చులు రూ.50 వేలు అందించారు. ఈ మేరకు నగదును సర్పంచ్ ఫాతిమున్నీషా బేగం, హెచ్‌ఎం సత్యనారాయణ, గ్రామ పెద్దలు బషీర్, హుస్సేన్, లక్ష్మణరావుకు పూర్వ విద్యార్థులు బుధవారం అందజేశారు. పాఠశాల తరగతి గది మరమ్మతులకు రూ.80 వేలు అవసరం కాగా.. హెచ్‌ఎం సత్యనారాయణ మరో రూ.10 వేలు అందజేశారు. ఉపాధ్యాయు లు ఎ.వి.ఎల్.ఎస్.కుమారి, ఎస్.వి.ఎస్.ఆచార్యులు, చిన్నారావు, రమేష్ బాబు, తదితరులు దాతలను అభినందించారు. మరికొంత మంది ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

కల్వర్టు నిర్మించండి సారూ..



కె.వెంకటాపురం-కొడవటిపూడి రహదారి

కోటవురట్ల: గట్టిగా వర్షం కురిసిందా ఆ రహదారిలో రాకపోకలు బంద్ కావాల్సిందే. తెగించి వెళ్తే వాగులో కొట్టుకుపోవడం ఖాయం. ఎన్నో ఏళ్లుగా సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వర్షాకాలంలో వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. కోటవురట్ల నుంచి కాకినాడ జిల్లా తుని వెళ్లే రహదారిలో కొడవటిపూడికి సమీపంలో కల్వర్టు లేకపోవడంతో వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడ తారు రోడ్డు వేసినప్పటికీ కల్వర్టు నిర్మించకుండా వాగునీరు ప్రవహించేలా రోడ్డు మధ్యలో కాలువలా వదిలేశారు. కుండపోతగా వర్షం కురిస్తే ఎగువ పొలాల నుంచి కాలువ ద్వారా ఉధృతంగా నీరు ప్రవహిస్తోంది. ఈ రహదారిలో ఎక్కువగా తుని వెళ్లే వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఒక్కొక్కసారి నీరు ఉధృతి తగ్గకపోతే వెనుదిరగాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అధికారులు స్పందించి ఇక్కడ కల్వర్టు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

రైతుల సహకారంతోనే నాగులాపల్లి సహకార సంఘం అభివృద్ధి



పీఏసీఎస్ సీనియర్ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: నాగులాపల్లి సహకార సంఘం అభివృద్ధికి రైతులు సహకరించాల్సిన అవసరం ఉందని అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి.జ్యోతీశ్వరరావు తెలిపారు. మండలంలోని నాగులాపల్లి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా సంఘం సీనియర్ సభ్యులతో పాటు పూర్వ అధ్యక్షుడు మళ్ల ఉమామహేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ సంస్థ అందరి సహకారంతో రూ.27.06 లక్షల మేర నికర లాభం ఆర్జించిందన్నారు. సేవల్లో ఉత్తరాంధ్రలో మేటి సొసైటీగా నాగులాపల్లి గుర్తింపు పొందిందన్నారు. రైతులకు సభ్యుల షేరు ధనంపై 15 శాతం బోనస్ ఇవ్వడం అభినందనీయమని చెప్పారు. సంఘం సీఈవో మళ్ల స్వామి, రైతులు యల్లపు భాస్కరరావు, యల్లపు వెంకటప్పారావు, బొద్దపు శ్రీరామమూర్తి, రాజునాయుడు, శివ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుతో అధిక ఆదాయం

- జిల్లా ఉద్యానవనశాఖాధికారి ప్రభాకర రావు



ఉద్యానవన పంటల సాగు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభాకర రావు

కె.కోటపాడు : ఉద్యానవన పంటల సాగుతో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు తెలిపారు. ఉద్యానవన పంటల సాగుకు ఆసక్తి గల రైతులకు ప్రభుత్వం రాయితీలను కల్పించనున్నట్టు చెప్పారు. గొండుపాలెంలో కృషిఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం 5వ వార్షికోత్సవాన్ని సంఘం చైర్మన్ బండారు దేముళ్లు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రభాకరరావు మాట్లాడుతూ కె.కోటపాడు మండలంలోని 20 గ్రామాల్లో సుమారు 500 మంది రైతులు కృషిఫల రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. ఆయా గ్రామాల్లో రైతులు పండించిన పంటలను ఉత్పత్తిదారుల సంఘానికి విక్రయించడం ద్వారా మద్దతు ధరను పొందవచ్చన్నారు. రైతులు సంఘంగా ఏర్పడి వ్యవసాయాన్ని చేస్తే ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహాన్ని అందించేందుకు చర్యలను చేపట్టనున్నట్టు తెలిపారు. అనంతరం ఉద్యావన సాగు పుస్తకాన్ని ఆవిష్కరించారు. జాగృతి మేనేజింగ్ డైరెక్టర్ సుజాత, ఉద్యానవనశాఖాధికారి కిరణ్మయి, ఏవో సోమశేఖర్, బండారు లక్ష్మణరావు, రెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని ప్రభావితం చేసేది కార్టూన్



కార్టూన్ల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు సత్యనారాయణ, వరహాలబాబు

నాతవరం: కార్టూను సమాజాన్ని ప్రభావితం చేస్తుందని ఎంఈవోలు సత్యనారాయణ కామిరెడ్డి వరహాల బాబు అన్నారు. మండలంలో చమ్మచింత గ్రామానికి చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ కార్టూనిస్ట్ అంబటి రాంబాబు.. తాను గీసిన కార్టూన్లతో ఏసీబీ పుస్తకాన్ని రూపొందించారు. ఆ పుస్తకాన్ని మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఎంఈవోలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంటిబాబు మాస్టారు రూపొందించిన కార్టూన్ల పుస్తకం పిల్లలు, పెద్దలను ప్రభావితం చేసేలా ఉందన్నారు. చంటిబాబు మాస్టారు గతంలో కూడా పిల్లలు కోసం అనేక కార్టూన్లు వేసి, ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని చెప్పారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా కార్టూన్ల పుస్తకం తీసుకురావడం చాలా ఆనందాయకమన్నారు. అనంతరం చంటిబాబు మాస్టార్‌ను ఎంఈవోలతో పాటు మండలంలోని పాఠశాలల హెచ్‌ఎలు, ఉపాధ్యాయ యూనియన్ల నాయకులు ఘనంగా సన్మానించారు.

మోతాదుకు మించి పురుగు మందులు వాడొద్దు



వడ్డాదిలో పొలంబడి కార్యక్రమంలో సూచనలు చేస్తున్న ఏవో భాస్కరరావు



చౌడువాడలో సూచనలు చేస్తున్న మండల వ్యవసాయాధికారి సోమశేఖర్

బుచ్చెయ్యపేట: పురుగు మందులను మోతాదు మించి వాడవద్దని మండల వ్యవసాయాధికారి భాస్కరరావు రైతులకు సూచించారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం వడ్డాదిలో వరి పొలాలను ఏవో సిబ్బందితో కలిసి పరిశీలించారు. వరి పంట ఆశాజనకంగా ఉండి, తెగుళ్ల బెడద లేకపోయినా పలువురు రైతులు మందులు వేయడాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతాదుకు మించి మందులు వినియోగిస్తే మిత్ర పురుగులు చనిపోవడమే కాక రైతులకు అదనపు పెట్టుబడి భారంతో పాటు పంటను వినియోగించే వారికి ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. వడ్డాది పాండవుల చెరువు నుంచి నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు ఈ సందర్భంగా అధికారులను కోరారు.

కె.కోటపాడు: చౌడువాడలో బుధవారం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగు విధానం, ఎరువులు, పురుగు మందుల వినియోగంపై వ్యవసాయాధికారి సోమశేఖర్ రైతులకు అవగాహన కల్పించారు. మోతాదుకు మించి పురుగు మందులు వాడితే జరిగే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎరుకునాయుడు, ఎంపీటీసీ వై.రాజేష్, పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు ఎర్రునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులపై అవగాహన అవసరం

చీడికాడ: పంటల సాగులో ఆధునిక పద్ధతులు,తెగుళ్ల నివారణపై రైతులు అవగాహన ఏర్పర్చుకోవాలని కె.వి.కె. శాస్త్రవేత్త బాబు తెలిపారు. మండలంలోని అర్జునగిరి,చీడిపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పలు సలహాలు,సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏవో రమాదేవితో పాటు అర్జునగిరి,చీడిపల్లి సర్పంచ్‌లు బి.రమాదేవి,కె.సూర్యనారాయణ, రైతులు ప్రసాదు,శంకరరావు పాల్గొన్నారు.



అర్జునగిరిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

సామాజిక తనిఖీ వేదిక రేపు

రోలుగుంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సామాజిక తనిఖీ వేదిక నిర్వహించనున్నట్టు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో కె.సూర్యమణి తెలిపారు. 2023–24లో ఎన్‌ఆర్‌ఈజీఎస్, పీఆర్, హౌసింగు తదితర శాఖల ద్వారా జరిగిన ఉపాధి పనులు, నిధుల వినియోగం తదితర అంశాల ఈ సభలో చర్చించనున్నట్టు చెప్పారు.